క్లుప్తంగా

అండగా ఉంటా : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: సగర ఉప్పర సంఘానికి ఏమైన సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ముందుగా ఎమ్మెల్యేకు సగర ఉప్పర సంఘం మహిళలు, సభ్యులు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించి, శాలువాతో సన్మానించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


పూజలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికంగా, రాజకీయంగా కురుమలు ఎదగాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

నారాయణఖేడ్: కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కరికే సత్యనారాయణ అన్నారు. ఖేడ్‌లో సోమవారం కురుమ సంఘం ముఖ్యనాయకుల సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు పోటీ చేసి అధిక స్థానాల్లో గెలిచి సత్తా చాటాలన్నారు. కురుమ సంఘం జిల్లా కార్యవర్గ కాలపరిమితి ముగిసినందున అందుబాటులో ఉండి కులస్తులకు సేవచేసే వారిని నూతన కార్యవర్గంలో ఎన్నుకోవాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి, ఆర్సీపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, కురుమ సంఘ జిల్లా అధ్యక్షుడు కిష్టయ్యమాస్టర్, ఇతర బాధ్యులు ఓంప్రకాశ్, లక్ష్మీబాయి, బీర్ గొండ, రాములు, రవి పాల్గొన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

సంగారెడ్డి క్రైమ్: రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యమని, వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని పట్టణ సీఐ రమేశ్, ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2025 సందర్భంగా సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భద్రత మహోత్సవాల్లో భాగంగా పోలీసులు ప్రజల్ని వివిధ రూపాల్లో చైతన్యం చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వాహన ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్ లేక ఎంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం తాగి వాహనం నడపొద్దు, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పాఠశాల, కళాశాల విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం వాహన డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులతో కలిసి వారు ప్రతిజ్ఞ చేశారు. పయనీర్స్ పాఠశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ట్రాఫిక్ ఎస్ఐ రాములు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం ఇంద్రేశం చౌరస్తాలో సిబ్బందితో కలిసి ఆయన ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, చట్టరీత్యా నేరమన్నారు. స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు డ్రైవ్ చేయరాదన్నారు. వాహనదారులలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు.

ఎస్ఐ దాతృత్వం

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మొహమ్మద్ ఆసిఫ్ అలీ ఆదివారం రాత్రి రోడ్డు పక్కన నిద్రిస్తున్న నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలిలో గజగజ వణికిపోతున్న వారి పరిస్థితిని చూసి చలించి, నిద్రావస్థలో ఉన్న పేదలకు దుప్పట్లు కప్పారు.

– పటాన్‌చెరు టౌన్:



మంత్రికి సన్మానం

మా గ్రామానికి వచ్చి స్థితిగతులు తెలుసుకోవాలని చౌటకూర్ మండలం చేక్రియాల గ్రామస్తులు సోమవారం కోరారు. సంగారెడ్డిలోని మంత్రి దామోదర నివాసానికి వెళ్లి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా చూడాలని విన్నవించారు.

– సంగారెడ్డి



చీరల కంచె శ్రీరామరక్ష

అటవీ పందులతో బెంబేలు

- కర్ణాటక సరిహద్దుల గుండా పొలాల్లోకి..
- పంటలను నష్టపరుస్తున్న దుస్థితి
- ఇబ్బందుల్లో రైతున్న

జిల్లాలోని పలు ప్రాంతాల్లో అడవి పందుల బెడద అధికమైంది. రాత్రివేళల్లో పంటలపై తెగపడి తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయి. కొంతమేర తిని తర్వాత ఆగమాగం చేస్తున్నాయి. వీటిని రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో వారిపైనా దాడి చేస్తున్నాయి.


గుంజోటి గ్రామ శివారులో పొలం చుట్టూ చీరలు కట్టిన రైతు

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలోని న్యాల్‌కల్, రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్, మానూర్, నారాయణఖేడ్, కోహీర్ తదితర మండలాల్లో అడవి పందుల సంచారం ఎక్కువగా ఉంది. ఇవి కర్ణాటక సరిహద్దుల గుండా పందులు ఎక్కువగా ఇక్కడకు వస్తున్నాయి. ప్రస్తుతం పొలాల్లో ఉన్న చెరకు పంటతో పాటు జొన్న, శనగ, కూరగాయలు ఇతర పంటలు సాగులో ఉన్నాయి. సాగు చేసుకున్న పంటలను పందులు పాడు చేస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు పంట పొలాల చుట్టూ పాత చీర గుడ్డలు కట్టడం, పొలాల చుట్టూ ఇనుప తీగలు అమర్చడం, రాత్రి వేళల్లో టపాకాయలు పేల్చడం లాంటివి చేస్తున్నారు. ఫలితంగా పందులు బెడద నుంచి కొంత వరకు పంటలను రక్షించుకుంటున్నామని వారు తెలిపారు. రోజూ రాత్రి పంటలకు కాపలా వెళ్లవలసి వస్తుందన్నారు. అధికారులు చర్యలు తీసుకొని పంట నష్టపోయిన తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

జొన్న, శనగ సాగు చేస్తున్నా..



ప్రస్తుతం జొన్న, శనగ పంట సాగు చేసుకున్నా. పొలంలోకి వస్తున్న పందులు పంట పాడు చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు చీరలను కొని పొలం చుట్టూ కట్టుకున్నా. అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలి.

– మారుతి, రైతు గుంజోటి

చర్యలు తీసుకుంటాం

మా పంట పొలాలను పాడు చేస్తున్నాయని రైతులు మాకు ఫిర్యాదు చేయాలి. అప్పుడు క్షేత్ర స్థాయిలో శాఖ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పరిశీలించి పంట నష్టం వివరాలను పరిశీలిస్తారు. నివేదికలను ప్రభుత్వానికి పంపుతాం. బడ్జెట్ వచ్చిన వెంటనే రైతులకు పరిహారం అందిస్తాం.

– శ్రీధర్ జిల్లా ఫారెస్ట్ అధికారి, సంగారెడ్డి

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు అందనున్నాయని, నేటి నుంచి గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక జరగనుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. సంజీవన్‌రావుపేట్, నిజాంపేటలకు చెందిన 20 మంది కుమ్మరి కళాకారులు కుల వృత్తిని నూతన పద్ధతిలో లాభసాటిగా ఉండేలా శిక్షణ పొందగా వారికి ధ్రువపత్రాలు, పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికీ మంజూరవుతాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేస్తామని తెలిపారు. ఖేడ్ పట్టణ శివారులో అసంపూర్తిగా ఉన్న 948 డబుల్ బెడ్‌రూంలు పూర్తి చేయడం, మరమ్మతు పనులకు రూ.6.25 కోట్లను తన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ఈ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయమై లబ్ధిదారుల నుంచి నాయకులు డబ్బులు వసూలు చేశారన్నారు. సంక్షేమ పథకాల మంజూరు నిరంతర ప్రక్రియ అని ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందవద్దన్నారు. మంజూరు కాని అర్హులు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గృహనిర్మాణ శాఖ పీడీ చలపతిరావు, ఏఈలు సత్యనారాయణ, కోటేశ్వర్‌రావు, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, కౌన్సిలర్లు రాజేశ్ చౌహాన్, రామకృష్ణ, మాజీద్, నర్సింహులు, హన్మాండ్లు, పండరిరెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

సందీప్ షా మృతి తీరని లోటు

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణానికి చెందిన ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం నాయకుడు, జీఎంఆర్ యువసేన సభ్యుడు సందీప్ షా దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భార్యాపిల్లలతో కలిసి దేవాలయాలను సందర్శిస్తూ తిరుగు ప్రయాణంలో రైల్వే కోడూరు వద్ద జరిగిన ప్రమాదంలో సందీప్ షా అతని భార్య అంజలీదేవి మృతిచెందడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిని సంఘటన స్థలానికి పంపించామన్నారు. ప్రమాదంలో షా పెద్ద కూతురు తీవ్రంగా గాయపడి తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు. చిన్న కూతురు, కుమారుడు స్వల్ప గాయాలతో బయట పడ్డారని పేర్కొన్నారు. 25 సంవత్సరాలుగా తన కుటుంబంలో ఒక సభ్యుడిగా మెలుగుతూ.. నిత్యం ఉత్తర భారతీయుల సంక్షేమం కోసం తపన పడేవాడని గుర్తు చేసుకున్నారు. షా మరణం వ్యక్తిగతంగా తనకు తీరని లోటని భావోద్వేగానికి గురయ్యారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): గ్రంథాలయ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి సి.వసుంధర అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. పుస్తకాల నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రంథాలయానికి శాశ్వత భవనం గురించి స్థల సేకరణకు సహకరించాలన్నారు. పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆర్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మాచ్నూర్ గ్రామస్తులు

భూకబ్జా చేస్తున్న వారిపై చర్యలేవి?

ఇతర గ్రామాలకు చెందిన వారు తమ గ్రామంలో ఉన్న భూములు కబ్జా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఝరాసంగం మండలం మాచ్నూర్ గ్రామస్తులు కోరారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి అందజేశారు. ప్రభుత్వ భూమి సర్వే నం.100.12లో నాలుగు ఎకరాల భూమిలో 40 ఏళ్ల నుంచి తాము సాగు చేసుకుంటున్నామని తెలిపారు.

– సంగారెడ్డిజోన్

మా భూములు నిమ్జ్‌కు ఇవ్వం

రైతుల స్పష్టీకరణ


రాజుకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: మా భూములు నిమ్జ్‌కు కోసం ఇవ్వమని, ప్రాజెక్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని న్యాల్‌కల్ మండలం హద్నూర్ గ్రామ రైతులు సోమవారం జహీరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పొలాలు అత్యంత సారవంతమైనవని, రెండు పంటలు పండుతాయన్నారు. వాణిజ్య పంటలు కూడా చాలా బాగా సాగవుతాయన్నారు. తరతరాలుగా వాటిపై ఆధారపడి జీవిస్తున్నామని, పరోక్షంగా పలువురికి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. నిమ్జ్ కోసం భూములు తీసుకుంటున్నట్లు పత్రికల్లో సర్వే నంబర్‌లతో సహా ప్రకటన ఇచ్చారన్నారు. సెక్షన్ 15 కింద 60 రోజుల్లో అభ్యంతరాలు పెట్టుకోమని ప్రకటనలో పేర్కొన్నారన్నారు. 288.13 ఎకరాలకు సంబంధించి జారీ చేసిన ప్రాథమిక ప్రకటన చట్టప్రకారం చెల్లదన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సలహాలు సూచనలకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ అన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని ప్రయాణికులు 85003-76267 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలో బస్టాండ్ వద్ద సోమవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి (50) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. వారు ఘటన స్థలానికి చేరుకొని డేడ్ బాడీని పరిశీలించారు. ఎడమ చేయిపై షరీఫ్ అని పచ్చబొట్టు ఉండటానగమనించారు. ఆ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని వివరాలు తెలిస్తే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనిదినాలు పెంచాల్సిందే

- కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింహులు

నారాయణఖేడ్: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేస్తూ వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.నర్సింహులు డిమాండ్ చేశారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరగనున్న మహాసభల విజయవంతం కోసం నిర్వహిస్తున్న ప్రచార జాతా సోమవారం నారాయణఖేడ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రాజీవ్‌చౌక్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల 25న సంగారెడ్డిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. భూమి లేని నిరుపేదలకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున కేంద్రం ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఖేడ్ ఏరియా కమిటీ కార్యదర్శి రమేష్, సతీష్, అర్జున్, శివరాజ్, అనిల్, ప్రవీణ్, అరుణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు షురూ

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 22 వార్డులలో వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో నేటి నుంచి వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మంగతాయారు సోమవారం తెలిపారు. పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను వార్డు సభల్లో చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సభలు కొనసాగుతాయని తెలిపారు. ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో నేటి నుంచి 24 వరకు ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రతా కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు సంబంధించి గ్రామ పంచాయతీలలో సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు పేర్కొన్నారు. సభల నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించామన్నారు. పథకాలకు అప్పటికప్పుడే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కంగ్టిలో...

కంగ్టి(నారాయణఖేడ్): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. ఉదయం 9 గంటలకు ముర్కుంజాల్, సర్దార్‌తండా, ఘన్‌పూర్, గాంధీనగర్, హోబాతండా, ఎన్కెమూరి, చందర్‌తండాలలో మధ్యాహ్నం 1 గంటకు బాన్సువాడ, రాజారాంతండా, ముకుందతండా, సాధుతండా, చౌకన్‌పల్లి, నాగన్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 22న ఉదయం 9 గంటలకు దామర్‌గిద్దా, సుక్కల్‌తీర్థ్, రాంతీర్థ్, జమ్గి(కే), బోర్గి, ఎడ్లరేగడితండా, మధ్యాహ్నం 1 గంటలకు బాబుల్‌గాం, చాప్టా(బీ), భీంరాలలో సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న ఉదయం 9 గంటలకు నాగుర్(కే), జమ్గి(బీ), గాజుల్‌పాడ్, చాప్టా(కే), రాసోల్ మధ్యాహ్నం 1 గంటలకు నాగుర్(బీ), దెగుల్‌వాడి గ్రామాలతో పాటు 24న ఉదయం 9 గంటలకు తుర్కవడ్‌గాం, తడ్కల్, జీర్గితండా, మధ్యాహ్నం 1 గంటలకు సిద్ధంగిర్గా, కంగ్టిలలో సభలుంటాయని తెలిపారు.


న్యాల్‌కల్: మాట్లాడుతున్న అధికారులు

న్యాల్‌కల్‌లో...

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు సర్వేతో పాటు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ భూపాల్, ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్ అన్నారు. మంగళవారం నుంచి నిర్వహించే గ్రామ సభలకు సంబంధించి సోమవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఆయా శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆదివారం పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 36 మందిని పట్టుబడ్డారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ. 2 వేలు జరిమానా, మరో 22 మందికి రూ. 1500 జరిమానా, మరో ఐదుగురికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా, ఇద్దరికి జరిమానాతో పాటు రెండు రోజులు జైలు, అలాగే మరో ముగ్గురికి జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

జరిమానా..

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమాన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పాత బస్టాండ్ వద్ద, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. 11 మంది వాహనదారులు పట్టుపడ్డారు. సోమవారం జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధిఖీ ఇద్దరికి రూపాయలు 2000 జరిమాన,మిగతా ఐదుమందికి రూపాయలు 1500 జరిమాన. నాలుగురికి రూపాయలు 1000 జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్గొన్నారు.

◆ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కొల్లూరు గ్రామానికి చెందిన వడ్ల విజయలక్ష్మి కుటుంబ సభ్యుడు ఈశ్వరప్పకు రూ.45వేల చెక్కు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీఓ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శంకర్ పాటిల్, నాయకులు నందు పాటిల్, సంగమేశ్వర్, ఈరన్న, శివరాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ చెక్కుల పంపిణీ

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి.. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. సోమవారం తన కార్యాలయంలో లబ్ధిదారుడు కె.గోవర్ధన్‌కు రూ.60వేల విలువ గల చెక్కు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గొల్లగూడెంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరై సీఐ మహేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రతీఓటమి ఒక గెలుపునకు నాంది అని అన్నారు. పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడలు మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా భాగస్వామ్యం అయినప్పుడే పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన్న, నాయకులు సత్యనారాయణ, ఆశిరెడ్డి, చింటూగౌడ్, శ్రీనివాస్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.